క్లుప్తంగా

అన్నదాన పథక కౌంటర్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అన్నదాన పథకానికి సంబంధించిన కౌంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. అన్నదాన ట్రస్ట్‌కు విరాళమిచ్చే భక్తులకు ఆదాయ పన్నులో 50 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ట్రస్ట్‌కు రూ.లక్షకుపైగా విరాళమిచ్చే భక్తులు మహారాజపోషకులుగా, రూ.50 వేలకుపైగా విరాళం చెల్లించేవారు రాజపోషకులుగా, రూ.10 వేలకుపైగా విరాళమిచ్చేవారు పోషకులుగా వ్యవహరించనున్నారని తెలిపారు. పదేళ్ల వారు కోరిన రోజున అమ్మవారికి వారి గోత్రనామాలతో అష్టోత్తర పూజను నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తలు మల్లు రామ్మోహన్‌రెడ్డి, సన్నపరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, కొండా సతీష్, ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, ఉప ప్రధానార్చకుడు రవిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడులు

బుచ్చిరెడ్డిపాళెం: సాగునీటి విషయమై ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన మండలంలోని జొన్నవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వీరప్రతాప్ వివరాల మేరకు.. జొన్నవాడకు చెందిన ముంగర శీనయ్య, ముంగర వెంకటకృష్ణయ్య మధ్యన గత కొంత కాలంగా పొలానికి సాగునీరు పెట్టుకునే విషయమై వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇద్దరు పొలాలకు ముందుగా సాగునీరు పెట్టుకోవాలని గొడవకు దిగారు. ఈ క్రమంలో రైతుల కుమారులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



కొడవలూరు: మండలంలోని అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయిన్‌లు, సిమెంట్ రోడ్లు, విద్యుత్ లైన్‌ల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు, నాయకులు సమన్వయంతో పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో గండవరంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నందున అందుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో చివరి దశలో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, బుచ్చి సీఐ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఏ రమేష్, తాతారావు, ట్రాన్స్‌కో ఏఈ ఎం రాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు పెనాక శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీ రాధాకృష్ణ, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎస్కే ముజీర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 18 వేల హెక్టార్లలో నిమ్మ సాగు

పొదలకూరు : జిల్లాలో 18 వేల హెక్టార్లలో నిమ్మ సాగు చేపడుతున్నట్లు జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నిమ్మ సాగు విస్తీర్ణం పెరుగుతోందని తెలిపారు. కొన్ని మండలాల్లో నిమ్మకు ప్రత్యామ్నాయ పంటలు లేవన్నారు. ప్రస్తుతం నిమ్మ ధరలు బాగుండడంతో ప్రధానంగా మెట్టప్రాంత రైతులు నిమ్మసాగుపై మక్కువ చూపుతున్నారని చెప్పారు. పొదలకూరు, సైదాపురం, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, తదితర మండలాల్లో నిమ్మసాగు పెరుగిందని వివరించారు. కూరగాయల పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాలతో పాటు ఇతర రాయితీలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఆయన వెంట పొదలకూరు ఉద్యానాధికారి ఆనంద్, తదితరులు ఉన్నారు.

రాత్రి గస్తీని ముమ్మరం చేయాలి

• నైట్ బీట్స్ తనిఖీల్లో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): రాత్రి గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అక్రమ రవాణా కట్టడికి వాహన తనిఖీలను విస్తృతంగా చేపట్టాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్, ఆర్టీసీ బస్టాండ్, ఏసీ కూరగాయల మార్కెట్, రైల్వేస్టేషన్, తదితర ప్రాంతాల్లో నైట్ బీట్లను గురువారం అర్ధరాత్రి ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై పలువురు అనుమానాస్పదంగా ఉండటంతో వారి వేలిముద్రలను ఫిన్స్‌తో సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. పలు వాహన రికార్డులను పరిశీలించారు. ఎక్కడి నుంచి.. ఎక్కడికెళ్తున్నారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అకారణంగా రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు చోట్ల దుకాణాలను తెరిచి ఉండటంతో వాటిని వెంటనే మూసేయాలని.. రాత్రి పది గంటల తర్వాత దుకాణాలను తెరిచి ఉంటే కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల భద్రత, రక్షణకు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా కట్టడికి వాహన తనిఖీలను చేపట్టాలని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్యసేవనంపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తాళాలేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, తదితరాలను గస్తీ సమయాల్లో పరిశీలించాలని చెప్పారు. రాత్రి గస్తీ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీ హిమవతి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

ఐటీఐలో భారత్ పక్షోత్సవాలు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో జీ – 20 భారత్ పక్షోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రజియా మాట్లాడారు. వ్యాసరచన, భవిష్యత్తు లక్ష్యాలు, వాల్ పెయింటింగ్, స్వచ్ఛత, మొక్కలు నాటడం, తదితర అంశాలపై కార్యక్రమాలను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని తెలిపారు.



రంగవల్లులను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీ సమీపంలోని జగనన్న కాలనీకి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైన నేపథ్యంలో స్థలాన్ని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదనరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడారు. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించామని చెప్పారు.



సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్‌గా జ్యోతిర్మయి

నెల్లూరు(బృందావనం): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్‌గా జ్యోతిర్మయి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. కర్నూలు సంగీత, నృత్య పాఠశాలలో వోకల్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న సాయిబాబా బాధ్యతలను ఆమెకు అప్పగించారు.



గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మెటర్నిటీ వార్డులో గర్భిణులకు పౌష్టికాహారాన్ని రోటరీ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఏనుగు పట్టాభిరామిరెడ్డి ట్రస్ట్ ద్వారా శుక్రవారం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, రోటరీ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తిరుపతి శేఖర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్‌బాబు, హెచ్‌ఓడీ గీతాలక్ష్మి, ఆర్‌ఎంఓ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.



రుణాలు పొందేలా అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారులు రుణాలను పొందేలా అవగాహన కల్పించాలని, నిర్మాణాలు పూర్తయిన గృహాలకు విద్యుత్ సదుపాయాన్ని వెంటనే కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో టిడ్కో విభాగం, విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థ, మెప్మా విభాగాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. మెప్మా విభాగాధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు రుణాల మంజూరుకు గానూ ప్రత్యేక మేళాలను నిర్వహించాలని సూచించారు. రుణాలు మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. రుణాలపై ఆసక్తి చూపని లబ్ధిదారులు.. బ్యాంకుల నుంచి రుణాలు తిరస్కరణకు గురైన వారితో ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. టిడ్కో సముదాయాల్లో విద్యుత్, వీధి దీపాలు, మంచినీరు, డ్రెయిన్లు, రోడ్డు మార్గాలను కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని కోరారు.

టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీ నియంత్రణకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రిలో నమోదైన టీబీ కేసుల రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడి హెచ్‌ఓడీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నారాయణ ఆస్పత్రిలో మూడు నెలల్లో 500 మందికి టీబీ పరీక్షలు నిర్వహించగా, 30 మందికి వ్యాధి నిర్ధారణ కావడం ఆందోళనకరమని తెలిపారు. నారాయణ ఆస్పత్రి వైద్యులు పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు వైద్యశాఖకు అందించాలని కోరారు. దీని ద్వారా ప్రభుత్వ తరఫున రోగులను నిత్యం పరిశీలిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడతామని తెలిపారు. పౌష్టికాహారం కోసం రోగులకు ప్రతి నెలా రూ.500ను అందిస్తామని చెప్పారు. తొలిసారిగా కేసును గుర్తించిన డాక్టర్‌కు సైతం ప్రోత్సాహకంగా రూ.500ను అందిస్తామన్నారు. జిల్లా ప్రోగ్రామింగ్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, నర్సింహులు, నారాయణ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైద్యులు

స్పందన ఫిర్యాదుల పరిశీలన

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో స్పందన ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి కమిషనర్ వికాస్ మర్మత్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పర్యటించారు. నారాయణరెడ్డిపేట, అరవిందనగర్, తదితర ప్రాంతాల్లో ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడారు. ఆక్రమణలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులను జారీ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కల్లూరుపల్లిలోని మహావీర్ పశు సంరక్షణ సేవా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో సంరక్షణ పొందుతున్న వివిధ రకాల జంతువులను పరిశీలించి, వాటి కోసం చేపడుతున్న జాగ్రత్తలను ఆరాతీశారు. కమిషనర్‌ను పశు సంరక్షణశాల కార్యదర్శి ఇందిర ఘనంగా సత్కరించారు.

సచివాలయాల్లో తనిఖీలు

నగరపాలక సంస్థ పరిధిలోని 19 / 1, 2 రామలింగాపురం వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి రేపు

నెల్లూరు(బృందావనం): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను అరవింద్‌నగర్‌లోని మన హాస్పిటల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలు గీతాలతో సంగీత నీరాజనాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శనివారం ఉండదని నెల్లూరు వెస్ట్ – 2 ఏఈ గోపీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుప్తా పార్క్, సంతపేట, గోపీ టీ షాప్ సెంటర్, తూకుమానుమిట్ట, బ్రాహ్మణవీధి, ములుమూడి బస్టాండ్, చిన్నబజార్, కోటమిట్ట, కుక్కలగుంట, గిడ్డంగివారివీధి, పాత మున్సిపల్ కార్యాలయం, డీఎంహెచ్‌ఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'పై స్పందన 5 నుంచి

నెల్లూరు రూరల్: జగనన్నకు చెబుదాంపై స్పందన కార్యక్రమాన్ని ఈ నెల ఐదు నుంచి ప్రతి సోమవారం నిర్వహించనున్నామని నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ప్రాంతాల సమస్యలను పరిష్కరించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నివాసాన్ని ఖాళీ చేయించడం అన్యాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించడం అన్యాయమని పార్టీ నేత డాక్టర్ పల్లం రెడ్డి యశోధర పేర్కొన్నారు. కొత్త వెల్లంటిలోని దళితవాడలో ఇంటింటికీ స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె నిర్వహించారు. నేతలు వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ, భాస్కర్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి కృతజ్ఞతలు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సిబ్బంది బదిలీలను పారదర్శకంగా నిర్వహించిన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, నేతలు శివప్రసాద్, శ్రీనివాసులు, జయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఖాళీ పోస్టులను ప్రదర్శించి సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్‌ను నిర్వహించి సిబ్బంది కోరుకున్న చోట పోస్టింగ్‌లు కల్పించడం సంతోషకరమని చెప్పారు. సిబ్బంది సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ఏఎస్పీ హిమవతి, ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

రేపట్నుంచి మహాకుంభాభిషేక పూజలు

నెల్లూరు రూరల్: పడారుపల్లిలో వెలసిన గంగమ్మ దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక పూజలను ఈ నెల నాలుగు నుంచి ఎనిమిది వరకు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు(వేదాయపాళెం): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ దిష్టిబొమ్మను గాంధీబొమ్మ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సిరాజ్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి షానవాజ్, ఇన్సాఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్, అహ్మద్, నేతలు రమణయ్య, మున్నా, మధు, షాకీరా, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో ట్రెయినీ కలెక్టర్

నెల్లూరు(పొగతోట): జెడ్పీలో పరిపాలన, రికార్డుల నిర్వహణను ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా శుక్రవారం పరిశీలించారు. జెడ్పీలో పాలన, రికార్డుల నిర్వహణ, అర్జీల పరిశీలన, పరిష్కారం, తదితర అంశాలను ఆరాతీశారు. అనంతరం డీఆర్డీఏలో గ్రామ, వార్డు సచివాలయాల నిర్వహణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు





నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. పలు విశేష పూజలను కుర్తాళ సిద్ధేశ్వరి పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు శుక్రవారం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉభయకర్తలుగా పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, లక్ష్మీప్రత్యూష, పోలుబోయిన ఆదిశేషయ్య, రజని, ఏలేశం భాస్కర్‌రెడ్డి, రమాదేవి, తుమ్మగుంట శేషయ్య, సువర్ణలత, నెల్లిపూడి సుకుమార్‌రెడ్డి, సుధ దంపతులు వ్యవహరించారు.

నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ నేడు

నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాన్ని శనివారం ఉదయం 6.30 నుంచి 11.30 వరకు నిర్వహించనున్నామని ఈఓ నవీన్‌కుమార్, చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

క్రైమ్ కార్నర్

గొంతునులిమి.. హతమార్చి

• పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడి

నెల్లూరు(క్రైమ్): గతేడాది నవంబర్‌లో మణికంఠ అనే యువకుడి మృతదేహాన్ని గోనె సంచిలో కనుగొన్నారు. అయితే అతని మృతి అనుమానాస్పదం కాదని.. గొంతునులిమి హత్య చేశారని పోస్ట్‌మార్టం నివేదికలో వైద్యులు నిర్ధారించారు. దీంతో దర్గామిట్ట పోలీసులు కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండంగికి చెందిన మణికంఠ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన ఓ మహిళతో ఆయనకు పరిచయమైంది. దీంతో నెల్లూరు వచ్చారు. ఈ క్రమంలో గతేడాది నవంబర్‌లో గౌతమినగర్ ప్రాంతంలో గోనె సంచిలో అనుమానాస్పద స్థితిలో ఆయన మృతి చెంది ఉండటాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య పరిశీలించారు. మృతుడి జేబులో సూసైడ్ లేఖలు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దీని ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. సమస్యను పక్కదోవ పట్టించేలా లేఖ ఉందనే అంశాన్ని పోలీసులు అప్పట్లో గుర్తించారు. యువకుడు ఎవరనే విషయాన్ని ఆరాతీయగా ఏలూరు జిల్లాకు చెందిన మణికంఠగా గుర్తించారు. ఈ క్రమంలో పోస్ట్‌మార్టం నివేదికలో మణికంఠను గొంతునులిమి హత్య చేశారని వెల్లడైంది. దీంతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చారు. మృతుడికి ఎవరెవరితో పరిచయాలు ఉన్నాయి.. కాల్ డీటైల్స్.. ఎక్కడ ఉంటున్నారు.. తదితర వివరాలను సేకరించారు. మణికంఠ హత్య కేసులో ఓ మహిళ ప్రధాన సూత్రధారని.. ఆమే ఈ ఘాతుకానికి ఒడిగట్టారని పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారని విశ్వసనీయ సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లో ఈ కేసు మిస్టరీని ఛేదించి నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పూత పనులు చేస్తూ రెండో అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న జగ్గారావు మేనల్లుడు కృష్ణారావు (38) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయ రోడ్డులోని పోలేరమ్మ గుడి సమీపంలో లతీఫుద్దీన్ ఖిల్జీకి చెందిన ఇంటి నిర్మాణ పనులకు గత నెల 28న కృష్ణారావు వెళ్లారు. రెండో అంతస్తులో పూత పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డారు. తలకు తీవ్రమైన గాయమైన ఆయన్ను చికిత్స నిమిత్తం కిమ్స్ హాస్పిటల్‌కు యజమాని తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్ ఆస్పత్రిలో గత నెల 30న కుటుంబసభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆయన మృతి చెందారు. జగ్గారావుకు మృతుడి భార్య ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఉక్కపోతగా ఉందని తలుపులు తెరిచి నిద్రించడంతో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రమౌళీనగర్‌లో చంద్రశేఖర్‌రెడ్డి తన తల్లితో కలిసి ఉంటుండగా, ఆయన తమ్ముడు దేవకుమార్ బెంగళూరులో నివసిస్తున్నారు. ఈ క్రమంలో అన్న వద్దకు దేవకుమార్ గురువారం వచ్చారు. చంద్రశేఖర్‌రెడ్డి తల్లి తన ఏడున్నర సవర్ల బంగారు ఆభరణాలను తీసి ఫ్రిడ్జ్‌పై పెట్టారు. వేసవి కావడంతో ఇంట్లో ఉక్కపోతగా ఉందని తలుపులు తెరిచి నిద్రించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఫ్రిడ్జ్‌పై ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం నిద్ర లేచిన అనంతరం బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వారు ఇల్లంతా గాలించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన సన్నపరెడ్డి అనీల్ కుమార్ రెడ్డి, తండ్రి జనార్దన్ రెడ్డి, HSR లే-అవుట్, బెంగుళూరు గారి అనుమతి మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిని శ్రీ వెలగండల మల్లిఖార్జున, తండ్రి వెంకట సుబ్బయ్య, అనికేపల్లి గ్రామం వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు మల్లిఖార్జున ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిని కోదూరు గోపాలరెడ్డి, తండ్రి బలరామిరెడ్డి అనికేపల్లి గ్రామం వారి నుండి రిజిస్టర్ విక్రయపత్రం తేది 11-9-1989 డాక్యుమెంట్ నెంబర్ 1236/89 ద్వారా కొనుగోలు చేసినారని సదరు గోపాలరెడ్డి గారికి ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తి వేమారెడ్డి కోదండరామిరెడ్డి గారు వ్రాయించి ఇచ్చిన రిజిస్టర్ వీలునామా ద్వారా చెందినదని, సదరు రిజిస్టర్ వీలునామా వారి వద్ద కనిపించుట లేదని మరియు ఈ షెడ్యూల్ దాఖల ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, అడమానములు, వ్యవహారములు, క్లైంలు, లీజులు, అప్పులు, అగ్రిమెంట్లు లేవని చెప్పుచున్నారు. కావున ఈ షెడ్యూల్ దాఖల ఆస్తిపై ఎవరికేని ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన తేది దినం నుండి 7 రోజులు లోగా ఈ క్రింది అడ్రసుకు లిఖిత పూర్వకంగా సరిఅగు ఆధారములతో తెలుపకొనవలసింది. తదుపరి ఆక్షేపణలు నా క్లైంట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు రి.డి. యిలాకా మత్తుకూరు సు॥రి॥ వెంకటాచలం మండలం, అనికేపల్లి గ్రామం, నెల్లూరు జిల్లా, సర్వే నెం. 160, పట్టా నెం. 295 యు 26.96 సెంట్లు నాకు హక్కు అనుభవం కలిగి యు 4.77 1/2 సెంట్లు లేదా 1.932 హెక్టార్ల విస్తీర్ణంలో 3 ఎకరాల భూమికి హద్దులు.
తూర్పు : వెలగండల మల్లిఖార్జున గారి భూమి, పడమర : సన్నపరెడ్డి అనీల్‌కుమార్ గారి భూమి, దక్షిణం : పున్నేపల్లి ప్రసాద్ గారి భూమి, ఉత్తరం : వెలగండల రామయ్య గారి భూమి

పెనుబాక గంగాధర్ రెడ్డి, B.Com., B.L. అడ్వకేటు,
రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు. సెల్ : 9849349333